ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

పేదలతో మాట్లాడుతున్న ఎం.ఇంతియాజ్

పట్టాలిచ్చే వరకూ స్థలంలోనే ఉంటాం

అధికారులు హామీని నిలబెట్టుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలిచ్చేంత వరకు ఆ స్థలాల్లోనే ఉంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ స్పష్టం చేశారు. పాలసముద్రం క్రాస్‌లో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 125లో సిపిఎం ఆధ్వర్యంలో కంపచెట్లు, కలుపు మొక్కలు తొలగిస్తూ గత రెండు రోజుల క్రితం భూస్వాధీన పోరాటం నిర్వహించారు. అక్కడే పేదలు ఉంటున్నారు. గురువారం కూడా ఈ కార్యక్రమం కొనసాగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి పేదలతో మాట్లాడారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిద్దామని వారికి చెప్పారు. పేదల పోరాటం విషయం తెలుసుకున్న తహశీల్దార్ గురువారం నాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తామన్నారు. గతంలో పట్టాలు ఉన్న ప్రతి ఒక్కరికీ 15 రోజుల్లోపు ప్లాట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్వాధీన అనుభవంలో ఉన్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఇప్పటికీ ఇళ్ల స్థలాల కోసం ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుండా ఉంటే వారు మూడు రోజుల్లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ తహశీల్దార్‌తో మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు ఇస్తామని అధికారులు చెప్పిన హామీ అమలయ్యేంత వరకు పేదలు స్వాధీన అనుభవ స్థలాల్లోనే ఉంటారన్నారు. భూమిని వదిలిపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫిరంగి ప్రవీణ్, పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమయ్య, రమణ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశులు, సిపిఎం నాయకులు కొండా వెంకటేశులు, రామకృష్ణ, మాబుతో పాటు 200 మంది పేదలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఏర్పాటు

పాలసముద్రంలో ఇళ్లు లేని నిరుపేదలతో కలిసి ఇళ్ల స్థలాల పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా అశ్విని, వజీర్, కోశాధికారిగా అచ్చమ్మ, వెంకట లక్ష్మమ్మను ఎన్నిక చేశారు.

అంగన్వాడీల సమ్మెనోటీసు

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లలో గురువారం సిఐటి యు, ఎఐటియుసి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మె నోటీసు అంద జేశారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బందికి వేతనాలు, రిటైర్మెంట్ వయసు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, మెడికల్ సెలవులు, సంక్షేమ పథకా లు, ప్రమోషన్లు, తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ సంపూర్ణమ్మ, దేవి, సుజాత, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు ప్రాంతంలో వర్షం లేక మిరప మొక్కలకు డబ్బాతో నీరు పోస్తున్న రైతులు (ఫైల్ ఫోటో)

తుఫాన్‌లోనూ వర్షం కరువే..!

- ◆ అనంతను తాకని మిచౌంగ్ తుఫాన్
- ◆ రాష్ట్రమంతటా వర్షాలు
- ◆ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పడని వాన

మిచౌంగ్ తుఫాను రాష్ట్రం మొత్తాన్ని వణికించింది. తుఫాన్ దెబ్బకు గత మూడు రోజులుగా అంతటా అపారమైన నష్టం సంభవించింది. కాని ఉమ్మడి అనంతపురం జిల్లాపై మాత్రం దీని ప్రభావం లేదు. మేఘాలు కమ్ముకుని రావడం అంతలోనే గాలి వేగానికి కొట్టుకుపోవడం కనిపించింది. అప్పుడప్పుడు, అక్కడక్కడ కొద్దిపాటి చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. తుఫాన్‌లో సైతం వర్షం కరువు అవడంపై రైతులు తీవ్ర నిర్వేదాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

డిసెంబర్ 1వ తేదీ నుంచి తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రం అంతటా వర్షాలు అన్ని చోట్లా వర్షాలు పడుతున్నాయి. వానల ఉధృతికి పలు నగరాలు జలమయం అయ్యాయి. పంటలు చాలా వరకు నష్టం వాటిల్లాయి. మూడు రోజుల పాటు వర్షం జనజీవనాన్ని స్తంభింపజేసింది. అక్కడ పరిస్థితి అలా ఉంటే అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో చినుకు జాడలేదు. ఒక్క ఎన్‌పికుంట మండలంలో మాత్రమే ఒక మోస్తరు వర్షపాతం తుఫాను ప్రభావం కారణంగా పడిందని చెప్పవచ్చు.

పడని వాన

ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచే వర్షాభావం జిల్లాలో నెలకొంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వర్షాభావం వెంటాడుతుండటంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో మిచౌంగ్ తుఫాను ప్రభావంతోనైనా వర్షాలొస్తాయని రైతులు భావించారు. రాష్ట్రమంతటా వర్షం పడినప్పటికీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాన పడలేదు.

ఇలాంటి వర్షం జాడ అనంతపురంలో లేనేలేదు..!

డిసెంబరు ఒకటి నుంచి ఇప్పటి వరకు చూస్తే అనంతపురం జిల్లాలో సగటున 1.1 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయ్యింది. అది కూడా ఆత్మకూరు మండలం పరిధిలో 8.6 మిల్లీమీటర్లు, తాడిపత్రి పరిధిలో 6.5 మిల్లీమీటర్లు, పెద్దపప్పూరు మండలంలో 6.5 మిల్లీమీటర్లు, యల్లనూరు మండలంలో 4.9 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. తక్కిన చోట్ల చినుకుజాడలేదు. సత్యసాయి జిల్లాలో సగటున 4.7 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. అందులో గరిష్టంగా నంబులపూలకుంట మండలంలోనే వర్షపాతం నమోదయింది. 5వ తేదీన 47.8 మిల్లీమీటర్లు నమోదవగా 6వ తేదీన 0.5 మిల్లీమీటర్లు నమోదయింది. మొత్తంగా ఈ మండలం పరిధిలోనే ఈ ఐదు రోజుల్లో పడిన వర్షపాతం 51.5 మిల్లీమీటర్లు. ఆ తరువాత తలుపులలో 18.7 మిల్లీమీటర్లు, గాండ్లపెంటలో 18.1 మిల్లీమీటర్లు పడింది. ఈ మూడు మండలాల్లోనే తుఫాను ప్రభావం కొంత కనిపించింది. తక్కిన మండలాలు వర్షపాతం నమోదవలేదు.

ఏడాది మొత్తంగా 30 శాతానికిపైగా లోటు

అనంతపురం జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 453 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 288.7 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. సాధారణం కంటే 36.2 శాతం ఈ ఏడాది వర్షపాతం లోటుంది. 31 మండలాలు అనంతపురం జిల్లా పరిధిలో ఉంటే 24 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 521.5 మిల్లీమీటర్లు అయితే ఇప్పటి వరకు నమోదయిన వర్షపాతం 360.7 మిల్లీమీటర్లు. అంటే సాధారణం కంటే 30 శాతం వర్షపాతం లోటుంది. 32 మండలాలకుగానూ 25 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రెండు ప్రాంతాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రభుత్వం ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించింది. రబీలోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితులే నెలకొన్నాయి. ప్రభుత్వం కరువు మండలాలను అయితే ప్రకటించిది గానీ ఇంత వరకు ఎలాంటి సహాయక చర్యలూ చేపట్టలేదు. దీనిపై రైతుల నుంచి తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం అవుతోంది. కరువు మండలాల ప్రకటనతో ప్రభుత్వం మిన్నకుండిపోకుండా సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని సిపిఎం, రైతుసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవడంలో సర్కారు విఫలం

'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో పరిటాల సునీత

ప్రజాశక్తి-కనగానపల్లి

తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం లో భాగంగా గురువారం ఆమె రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లిలో ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అందులోని మహిళా సంక్షేమ పథకాలు, రైతులు, నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చే అంశాల గురించి అవగాహన కల్పిస్తూ ముందుకుసాగారు. సునీత మాట్లాడుతూ కోస్తా, నెల్లూరు, తిరుపతి జిల్లాలతో పాటు శ్రీసత్యసాయి జిల్లాలో తుఫాన్ ప్రభావంతో పెద్దఎత్తున పంట నష్టం జరిగిం దన్నారు. కోస్తా ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా వైసిపి మంత్రు లు, ఎమ్మెల్యేలు బస్సు యాత్రల పేరుతో షోలు చేస్తున్నారని విమర్శించారు. ఆ యాత్రలో ప్రతి పక్షాలు, చంద్రబాబుని తిట్టడమే పనిగా పెట్టుకున్నా రన్నారు. వైసిపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రైతులకు అండగా నిలబడాలని హితవు పలికారు.

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకురండి

పెనుకొండ : రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగి రైతులు ఆందోళనలతో ఉన్నా సిఎం జగన్ రెడ్డి తాడేపల్లిలోని ప్యాలెస్ వదిలి బయటకు రావడం లేదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బాధిత ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నిత్యావసర వస్తువులు సరఫరా చేయలేక, పునరావాసం కల్పించలేక చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. సిఎం జగన్ తూతూ మంత్రంగా సమీక్ష చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇకనైనా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవడంతో పాటు బాధితులకు అండగా నిలవాలని, తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. సమా వేశంలో నాయకులు మాధవనాయుడు, వెంకటరామిరెడ్డి, ఎస్ఎన్.గోవిందరెడ్డి, శ్రీరాములు, ప్రసాద్, మైలాలప్ప, త్రివేంద్రనాయుడు, మారుతిప్రసాద్, బాబుల్‌రెడ్డి, కోనాపురం సుబ్బు, చౌడప్ప, బాబు, మంజు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో సామాజిక న్యాయం అమలు

మంత్రి గుమ్మనూరు జయరామ్, ఎంపి నందిగామ సురేష్, ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

సామాజిక న్యాయం వైసిపి అధినేత, సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరామ్ పేర్కొన్నారు. పట్టణంలో గురువారం వైసిపి ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక విప్లవానికి నాంది పలికిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. సామాజిక న్యాయం నినాదం కాదు అమలు చేయాల్సిన విధానమని అధికారంలోకి వచ్చిన మొదటి రోజే చెప్పారని, అందుకగుణంగానే కనీవిని ఎరుగని రీతిలో నవరత్నాలు పథకాలు అమలు చేశారన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేశారన్నారు. ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే గడప దగ్గరే పింఛన్లు అందిస్తూ అవ్వ, తాతల మోహాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఎంపి నందిగాం సురేష్ మాట్లాడుతూ మంత్రివర్గంలో సామాజిక న్యాయాన్ని పాటించి దేశానికే చాటిన గొప్ప నాయకుడు జగన్ అన్నారు. ఎవరు మనకు ధైర్యాన్ని ఇస్తారో, మంచి చేస్తారో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ సిఎం జగన్ నిరంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేశారన్నారు. ఇంగ్లీషు మీడియంలో బోధనను ప్రవేశపెట్టి, అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన పథకాల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో జగన్‌తో పోటీ పడే వారే లేరు, భవిష్యత్తులో రారన్నారు. టిడిపి పాలనలో ఎన్నో హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చని చంద్రబాబు మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడని, నమ్మితే నిండా మునిగినట్టే అని హెచ్చరించారు. బహిరంగ సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపిలు గోరంట్ల మాధవ్, నందిగాం సురేష్, ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఒక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్లు పొగాకు రామచంద్ర, నలిని రంగేగౌడ్, హిందూపురం సమన్వయకర్త దీపిక, వైసిపి ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మంత్రి జయరాం

మంత్రి జయరామ్‌కు ఘనస్వాగతం

నియోజకవర్గంలో నిర్వహించే 'సామాజిక సాధికార బస్సుయాత్ర'లో పాల్గొనడానికి మడకశిరకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, వైసిపి జిల్లా అధ్యక్షులు శంకరనారాయణ, జడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ పరిశీలకులు అశోక్‌కుమార్, హిందూపురం ఇన్‌ఛార్జి దీపికవేణురెడ్డి, తదితరులను హరే సముద్రం న్యాయవాది కె.అశ్వర్థనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చి స్వాగతం ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నలిని రంగేగౌడ్, గుడిబండ, అమరాపురం జడ్పిటిసి సభ్యులు బిఎన్.భూతరాజు, సారక్క నరసింహమూర్తి, గౌడనహళ్లి మాజీ సర్పంచి శివశంకర్, బి.ఎర్రహనుమప్ప, బి.నరసింహమూర్తి, జిఎన్.పాలెం శివానంద, తదితరులు ఉన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

చెన్నేకొత్తపల్లి : చెన్నేకొత్తపల్లిలో గురువారం వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అంజలి, మండల వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విఆర్ఒపై దాడిని ఖండిస్తూ రెవెన్యూ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

విధి నిర్వహణలో ఉన్న విఆర్ఒపై దాడిని ఖండిస్తూ గురువారం రెవెన్యూ సిబ్బంది స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహశీల్దార్ ఎస్.శహబుద్దీన్ మాట్లాడుతూ మండల పరిధిలోని చిన్నపల్లి గ్రామానికి చెందిన రియల్టర్ సింగం సోమశేఖర్‌రెడ్డి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విధి నిర్వ హణలో ఉన్న విఆర్ఒ లోకేష్‌పై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించడం హేయమైన చర్య అన్నారు. నిందితుడిని పోలీసులు కఠినంగా శిక్షించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసు కోవాలని కోరారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒకు నివేదికలు పంపించామని, స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు గంగన మహేశ్వర్‌రెడ్డి, బాధిత విఆర్ఒ లోకేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న తహశీల్దార్ ఎస్.శహబుద్దీన్, రెవెన్యూ సిబ్బంది

'అమ్మ' హైపర్ మార్ట్ ప్రారంభం

మడకశిర : ప్రజలకు నాణ్యతతో కూడిన సరుకులు అందుబాటులో ఉంచి ప్రజల మన్ననలు పొందాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి సూచించారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'అమ్మ' హైపర్ మార్ట్ దుకాణాన్ని గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సుబ్బరాయుడు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్, మంజునాథ్, నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షుడు చింతపండు మోహన్, సంతోష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నా, మురళి, హొల్లి సర్పంచి రామాంజనేయులు, హనుమంతు, సోమశేఖర్‌రెడ్డి, దొరస్వామి పాల్గొన్నారు.

అమ్మ సూపర్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న తిప్పేస్వామి

అధికార పార్టీలో లుకలుకలు..!

'పురం' ఇన్‌ఛార్జితో కలిసొచ్చేది ఎవరు..?
మెజార్టీ నాయకుల్లో నిరుత్సాహం..!
కొందరికే ప్రాధాన్యత ఇవ్వడంపై అసహనం

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలోనే హిందూపురం శాసనసభ నియోజక వర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పలు పార్టీల నుంచి హేమాహేమీ నాయకులు ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించారు. 2019 ఎన్నికల్లో ఇక్కడ టిడిపి అభ్యర్థి నందమూరి బాలకృష్ణను ఢీకొట్టేందుకు మైనార్టీ అభ్యర్థి షేక్ మహమ్మద్ ఇక్బాల్‌ను వైసిపి పోటీలోకి దింపింది. ఆ ఎన్నికల్లో బాలయ్యపై ఇక్బాల్ ఓడిపోయారు. తర్వాత వైసిపి అధిష్టానం ఆయన్ను నియోజకవర్గ ఇన్‌ఛార్జితోపాటు ఎమ్మెల్సీ ఇచ్చి గుర్తించారు. తర్వాత పరిణామాల్లో ఇక్బాల్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించి దీపికను తెరపైకి తెచ్చారు. హిందూపురం వైసిపిలో నెలకొన్న అసంతృప్తులు అన్నింటినీ మూడు నెలల్లో అంత చక్కదిద్దుతానంటు పార్టీ రాయలసీమ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా ప్రకటించారు. ఇదే విషయాన్ని ఆ పార్టీ ద్వితీయ శ్రేణినాయకుల వద్ద వెల్లడించారు. ఇంత వరకు బాగానే ఉన్నా దీపిక ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు కావస్తున్నా ఆ పార్టీలో విభేదాలు ఓ కొలిక్కి రాలేదనే విషయం బట్టబయలు అవుతోంది. హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి వైసిపి అధిష్టానం ఊహించింది ఒక్కటి అయితే, క్షేత్రస్థాయిలో మరొకటి జరుగుతోంది. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందంగా పురం వైసిపి పరిస్థితి తయారైంది అంటూ ఆ పార్టీ నేతల నుంచే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత ఎన్నికల్లో వైసిపికి వచ్చిన 70వేల ఓట్లు అయినా ఈ సారి వస్తాయా.. లేదా.. అన్న అనుమానాలను ఆ పార్టీ నేతలు గుసగుస లాడుకుంటున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం నుంచి మూడవసారి గెలుపుతో పాటు భారీ మెజార్టీ వస్తుందంటూ వైసిపి నాయకులే పత్రిక సమావేశంలో చెబుతున్నారంటే ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది.

విభేదాలకు చెక్ పెట్టాలని భావించినా..!

హిందూపురం వైసిపిలో నెలకొన్న విభేదాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో అధిష్టానం మహ్మద్ ఇక్బాల్‌ను ఇన్‌ఛార్జిగా తప్పించి బీసీ మహిళను తెరపైకి తెచ్చారు. దీపికను ఇన్‌ఛార్జిగా ప్రకటించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యూహాన్ని రచించారు. అయితే ఆయన రచించి వ్యూహాలన్నీ ఆరు నెలల్లో పటాపంచలు అయినట్లు వాస్తవ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఇన్‌ఛార్జి దీపికతో కలిసి అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడా పూర్తి స్థాయిలో కలిసి రావడం లేదు. మొదట్లో అందరూ కలిసొచ్చినా ఆపై ఇన్‌ఛార్జి కొందరికే ప్రాధన్యత ఇస్తున్నారనే భావన మెజార్టీ వైసిపి నేతల్లో వ్యక్తం అవుతోంది. ఇదేకారణంతో ఇప్పటికే కొంత మంది ఆమెకు దూరమయ్యారు. ఇక్బాల్‌ను వ్యతిరేకించి దీపికకు మద్దతు ప్రకటించిన వారు కూడా ప్రస్తుతం ఆమెకు దూరం పాటిస్తున్నారు.

దూరం పాటిస్తున్న ముఖ్య నాయకులు

హిందూపురంలో వైసిపి ముఖ్య నాయకులు సైతం పార్టీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పార్టీ మాజీ సమన్వయ కర్త, బలమైన ఓటు బ్యాంకు కలిగిన నవీన్ నిశ్చల్ మొదటి నుంచి ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌ను వ్యతిరేకిస్తున్నారు. వారితో కలిసి పని చేయడానికి ఆయన అంగీకరించడం లేదు. మరొక మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి మొదట కలిసొచ్చినప్పటికీ ఆ తర్వాత దూరం అయ్యారు. ఇటీవల జరిగిన వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారోత్సవ సమయంలో అందరినీ కలుపుకుపోవాలని ఆయన సభాముఖంగానే చెప్పారు. చౌళూరు రామకృష్ణా రెడ్డి సోదరి మధుమతి రెడ్డి సైతం పార్టీ కార్యక్రమాల్లో పూర్తి స్థాయిలో పాల్గొనడం లేదు. కేవలం వారి గ్రామం సమీప ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో మాత్రమే నామమాత్రంగా పాల్గొంటున్నారు. దీపికకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి కూడా ప్రస్తుతం అంటీమట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇక ఇన్‌ఛార్జి వర్గంలో పట్టణంలో ముగ్గురు కౌన్సిలర్లే కీలకంగా కన్పిస్తున్నారు. మిగిలిన కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు అంతగా కలిసి రావాడం లేదు. ఇక్బాల్ వర్గంలో కీలంగా ఉన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ప్రస్తుత ఇన్‌ఛార్జితో కలిసి పని చేయడానికి మొదట్లో వ్యతిరేకించారు. ఆతరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమె దీపికకు జైకొట్టారు. ఛైర్‌పర్సన్ దీపికతో కలిసి ఉంటామని బయటకు చెబుతున్నా ప్రభుత్వ ప్రొటోకాల్ కార్యక్రమాల్లో సైతం ఇన్‌ఛార్జితో కలసి పాల్గొనడం లేదు. పార్టీ కార్యక్రమాలకు ఆమె దూరం పాటిస్తున్నారు. హిందూపురం రూరల్ మండలంలో మెజార్టీ నాయకులు ఇన్‌ఛార్జి దీపికతో కలిసి రావాడం లేదు. లేపాక్షి మండలంలో పెత్తనం, పదవులన్నీ ఒక నాయకుడికే కట్టబెట్టరని మిగిలిన వారు దూరం అయ్యారు. చిలమత్తూరు మండలంలో వైసిపి రెండు వర్గాలుగా నాయకులు, ప్రజా ప్రతినిధులు విడిపోయి ఒకరిపై తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఎంపిపి పురషోత్తం రెడ్డి మినహా మిగిలిన వారు పార్టీ ఇన్‌ఛార్జి కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదు.

మైనార్టీల అసంతృప్తి

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌ను అవమానకంగా హిందూపురం నుంచి సాగనంపారని మైనార్టీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వారంతా ఇప్పటికే వైసిపికి దూరం పాటిస్తున్నారు. ఇటీవల పట్టణంలో వైసిపి నిర్వహించిన సామాజిక బస్సుయాత్రలో పట్టుమని 10 మంది మైనార్టీలు కూడా కనిపించక పోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా అధికార పార్టీ నాయకులు ఎవరికివారే యమునతీరే అన్న చందంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 2024 జరిగే ఎన్నికల్లో హిందూపురంలో వైసిపి జెండా ఎగురవేయడం అంతసులువు కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం

ఇబ్బందుల్లో క్రయ,విక్రయదారులు

ప్రజాశక్తి కదిరి అర్బన్

పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్లు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు, ప్రజలు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న ప్రజలు మాట్లాడుతూ ఎప్పుడు చూసినా కార్యాలయం రద్దీగా ఉంటుందన్నారు. ఒక్క రిజిస్ట్రేషన్ కోసం 20 రోజుల నుంచి తిరుగుతున్నా ఫలితం కన్పించడం లేదన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానాలు సైతం చెల్లించి డాక్యుమెంట్ రైటర్ల దగ్గర ఇచ్చి కొనుగోలుదారులు అమ్మకదారులు సాక్షులతో రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇక సుదూర ప్రాంతాల నుంచి వచ్చి రిజిస్టర్లు చేయించుకునే వారి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. తేదీల వారీగా చెప్పినా కూడా ఆ సమయాన్ని ప్రకారం వచ్చి భూములు రిజిస్ట్రేషన్ చేసుకుంటామని అన్నారు. ఓ మహిళ మాట్లాడుతూ ఎక్కువ డబ్బులు ఇస్తే పనులు జరుగుతున్నాయని లేకపోతే సర్వర్ పని చేయలేదని చెప్పేసి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజలు పడుతున్న ఇబ్బందులు గమనించి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కదిరి సబ్‌రిజిస్టర్ కార్యాలయం

మాతాశిశు మరణాలపై సమీక్ష

లబ్ధిదారురాలికి ఆటో అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మాతా శిశు మరణాలపై స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023 జులై నుండి సెప్టెంబర్ వరకు శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో జరిగిన మాతా - శిశు మరణాపై సమీక్షించారు. మాతా శిశు మరణాలు సంభవించిన సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పని చేస్తున్న వైద్యాధికారులు, ఎఎన్‌ఎంలు, ఆశా, అంగన్వాడి కార్య కర్తలు, మృతిచెందిన తల్లీ బిడ్డల కుటుంబ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు.సమీక్షలో భాగంగా ఒక్కొక్క మరణానికి కారణాలను పరిస్థితులను విశ్లేషిస్తూ వాటిని నివారించగలిగిన విషయాలపై లోతుగా అధ్యయనం చేసి చర్చించారు. చర్చ సమయంలో వివరణ ఇవ్వలేక పోయిన వైద్య సిబ్బందికి నోటీసులు ఇవ్వాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. గర్భిణి అని తెలిసినప్పటి నుంచి కాన్పు అయి, బిడ్డ వయస్సు 1 సం, పూర్తి అయ్యేవరకు అన్ని శాఖలు సమన్వయం చేసుకొని అన్ని రకాల సేవలు అందించాలని, ఐ ఈ వాక్సినేషన్, వైద్య పరీక్షలు ఐసిడిఎస్ ద్వారా సరైన పోషక ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు , ఐసిడిఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పుట్టపర్తి అర్బన్ : మహిళా శక్తితోనే సాధికారిత సాధ్యమని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ఉన్నతి మహిళా శక్తి ఆటో పథకాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. అర్హులైన మహిళలకు ఈ పథకం ద్వారా అందించే ఆటోలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఎంపికైన ఇద్దరు ఎస్సీ మహిళలు, నలుగురు ఎస్టీ మహిళలకు కలెక్టర్ ఆటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీ రామ్మోహన్, ఎపిఎం లలిత, రామప్ప లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కియా ఉద్యోగి మృతి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని మందలపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మందలపల్లి గ్రామానికి చెందిన రాజప్ప కుమారుడు కుమార్(23) కియా కార్ల ఫ్యాక్టరీలో పని చేసేవాడు. అతడు విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తుండగా గ్రామ సమీపంలో అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పుట్టపర్తిలో వరుస చోరీలు

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఇటీవల కాలంలో చోరీలు జోరందుకున్నారు. గురువారం బ్రాహ్మణపల్లి తండా లో బైక్ పై వచ్చిన ఇద్దరు దుండగులు జయారం నాయక్ అనే వృద్ధుడినిపై దాడి చేసి బంగారు చైన్ దోచుకెళ్లారు. గత నెల 24వ తేదీన బ్రాహ్మణపల్లి తండా గ్రామానికి చెందిన ఒక ఆటో కార్మికుడు మనోహర్ నాయక్ ఇంటిలో దొంగలు చొరబడి ఆరు తులాల బంగారు, లక్ష యాభై వేల రూపాయలు నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మరవకముందే ఇదే గ్రామంలో చైన్ స్నాచింగ్ సంఘటన జరగడం పోలీసులకు పెనుసవాలుగా మారింది. స్థానికంగా ఉన్న సీసీటీవీ లో నిక్షిప్తమైన వీడియోల ఆధారంగా దుండగులను గుర్తించి త్వరలో ఈ కేసును ఛేదిస్తామని అర్బన్ సిఐ కొండారెడ్డి తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

తలుపుల : స్థానిక పోలీస్ స్టేషన్‌ను కదిరి డీఎస్పీ శ్రీలత గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని స్థానిక ఎస్ఐ మక్బూల్ బాషా ను ఆదేశించారు. అనంతరం స్థానిక కెజిబివిలో స్పెషలాఫీసర్ మోహనమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ విద్యార్థులకు పలు సలహా సూచనలు ఇచ్చారు. బాలికల రక్షణ ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ ఆహారంపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తిరూరల్ : కల్తీ ఆహారం పట్ల అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర సివిల్ సప్లై కన్స్యూమర్ అఫైర్స్ కమిషనర్ ఆదేశానుసారం స్థానిక జగరాజుపల్లి మోడల్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ రామచంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆహారం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఆహారం నాణ్యత తేదీని చూసి కొనుగోలు చేయాలని తెలియజేశారు. జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ రామచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఆహారంలో కల్తీలు ఏ విధంగా కనుక్కోవాలన్న దానిపై అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతినిత్యం కల్తీల పట్ల అప్రమత్తంగా ఉండి వినియోగదారుల చట్టాలను తెలుసుకొని ఏదైనా మోసం జరిగినట్టయితే వినియోగదారుల సంఘాలకు లేదా వినియోగదారుల కోర్టు ఆశ్రయించి తగు న్యాయం జరిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కపట్నం ఫారెస్ట్ రేంజర్‌పై ఫిర్యాదు

కొత్తచెరువు : బుక్కపట్నం అటవీప్రాంతంలో తొమ్మిది సంవత్సరాలుగా రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌పై పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. కరువు ప్రాంతంలో లక్షలకొద్దిచెట్లు నరికించి స్వార్థపరులకు సహకరించిన ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని పిసిసిఎఫ్ ఆంధ్రప్రదేశ్ వారికి భాస్కర్ నాయుడు విన్నవించారు.

ఆటో కార్మికుడికి ఆర్థికసాయం

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్‌కు చెందిన ఆటో కార్మికుడు నరసింహులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆటోకార్మికుడు నరసింహులు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు, పవన్ కళ్యాణ్, తిరుపాల్, ఎస్సీ నాయకులు చంద్రాయుడు, కోనప్పరవి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

ధర్మవరం టౌన్ : జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ ఎన్. విష్ణు ఆదేశాల మేరకు స్థానిక గూడ్స్‌కొట్టాలలో ధర్మవరం సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి చెప్పారు.

సత్యాగ్రహ దీక్షలను జయప్రదం చేయండి

కదిరి టౌన్ : రాష్ట్ర అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటి పిలుపు మేరకు ఈనెల 4వ తేదీ నుండి 11వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో జరిగే అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్షలను జయప్రదం చేయాలని అగ్రి గోల్డ్ బాధితుల అసోసియేషన్ కదిరి నియోజకవర్గ అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా కోరారు. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీ శనివారం కదిరి పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు వద్ద జరిగే దీక్షలో కదిరి నియోజకవర్గ బాధితులందరూ పెద్ద యెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున తెలిపారు. మానవత్వం పెంపొందించు విద్య ఆవశ్యకతపై స్థానిక ఎల్పీ సర్కిల్లోని పద్మావతి డిగ్రీ కళాశాలలో గురువారం రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో లక్ష్మీ, ఆయోషాలు ప్రతిభ కనబరిచారు. దీంతో వీరిని కళాశాల కరస్పాండెంట్ జగదీశ్, ప్రిన్సిపల్ మల్లికార్జున, అధ్యాపకులు శ్రీనివాసులు, రామాంజినేయులు అభినందించారు.

పంటసాగు సాయం పెంచాలి

ధర్మవరం టౌన్ : రైతుల పంట సాగుసాయం మరింత పెంచాలని ఏపీ రైతు సంఘం శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి. రమణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రైతుసంఘం నాయకులు గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలోని ఏవో కతిజున్ కుబ్రాకు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 32 మండలాలుగాను కేవలం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమన్నారు. మిగిలిన 11 మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు చేస్తున్న సాగు సాయం కేవలం రూ.13,500 మాత్రమే ఉందని దీని ప్రకారంగా రైతు కుటుంబానికి రోజుకు 37 రూపాయలు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. ఇలాంటి సాయం వలన ఏ రైతుకు పంటను సాగు చేయడం సాధ్యం కాదని తెలిపారు. అలా కాకుండా ప్రతి కుటుంబానికి రోజుకు 200 రూపాయలు వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు

ఉద్యోగుల నిరసన

పుట్టపర్తి అర్బన్ : జిల్లా కలెక్టర్ పై కొందరు రాజకీయ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల కలెక్టరేట్‌లోని ఉద్యోగులు నిరసన తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ ఉద్యోగులు నాయకుల అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి పుట్టపర్తి పర్యటనలో భాగంగా ప్రోటోకాల్ ప్రకారం కలెక్టర్ పాసులు మంజూరు చేశారన్నారు. అయితే కొందరు రాజకీయ నాయకులు తమకు పాసులు ఇవ్వలేదని అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బాధ్యత కలిగిన కలెక్టర్‌ను నిందించడం సరైంది కాదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజకీయ నాయకుల ధోరణి పట్ల నిరసన తెలుపుతున్నామన్నారు.

వివాహ వేడుకలో మాజీ మంత్రి

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని హనుమంతునిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయ సంఘం నాయకుడు హెచ్.తిమ్మప్ప కుమారుని వివాహం గురువారం శిర పట్టణంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు బిసి ప్రముఖ నాయకుడు, మాజీ మంత్రి హెచ్‌బి నర్సయ్యగౌడ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు విశ్రాంత ఎంఇఒ శివరామప్ప, జె.మారప్ప, శివప్రసాద్, గోవిందప్ప, హనుమక్క, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి

కోనేరు పనులు జరుగుతున్న దృశ్యం

బ్రహ్మోత్సవాలకు కోనేరు పనులు పూర్తి

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం కోనేరు పనులను పూర్తి చేస్తామని ఆలయ పాలకమండలి ఛైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. గురువారం కదిరి లక్ష్మీనరసింహస్వామి భృగుతీర్థంలో యంత్రాలతో చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. వీలైనంత తొందరలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. సంబంధిత ఇంజనీర్ల సహకారంతో ఎక్కడా లేనివిధంగా భృగుతీర్థాన్ని నూతన హంగులతో నిర్మించి వచ్చే బ్రహ్మోత్సవాలకు సిద్ధం చేస్తామని ఛైర్మన్ తెలిపారు.

అందుబాటులో లేని పశువైద్య సిబ్బంది

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిలో పశువైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గొర్రెలు, మేకల కాపరులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండటం లేదని సిపిఐ మండల కార్యదర్శి వంకమద్ది జి.రమణ విమర్శించారు. ఆసుపత్రికి తాళాలు వేసి ఉండడంతో ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. మండల వ్యాప్తంగా ఎక్కువ మంది రైతులు జెర్సీ ఆవులను నమ్ముకుని పాల ఉత్పత్తులను చేసుకుంటున్నారని చెప్పారు. పశువులు అనారోగ్యం పాలయితే పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్థానిక పశువైద్య కేంద్రంలో ఆసుపత్రి సిబ్బందితోపాటు పశు వైద్యాధికారి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భవన నిర్మాణం కోసం పట్టా అందజేత

తలుపుల : అభయ వికలాంగుల మండల సమాఖ్య భవన నిర్మాణం కొరకు స్థానిక తహశీల్దార్ శ్రీధర్ స్థల పట్టాను గురువారం అందజేశారు. భవన నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలని వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో పది రోజుల క్రితం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిచన ఆయన భవన నిర్మాణానికి అనువైన చోట మూడు సెంట్లు స్థలం కేటాయించి వారికి పట్టాను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ నారాయణస్వామి, శ్రీరాములు, శ్రీనివాసులు, మాబువలి, బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

బుక్కపట్నం : మండల కేంద్రంలో రామాలయ నిర్మాణ పనులను ఆలయ కమిటీ అధ్యక్షుడు కెంపరాజు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయం కోల్పోగా నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ఒక కమిటీగా ఏర్పడి దాదాపు కోటి రూపాయల వ్యయంతో పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గొర్లకృష్ణ, అక్కులప్ప, పూలకుంట్ల శీన, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల కన్వీనర్‌గా బెల్లం నజీర్

కొత్తచెరువు : కాంగ్రెస్ పార్టీ కొత్తచెరువు మండల కన్వీనర్‌గా బెల్లం నజీర్‌బాషాను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినటుల నజీర్‌బాషా తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు డిసిసి అధ్యక్షులు సుధాకర్‌కు, పుట్టపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బాలాజీ మనోహర్‌కి ,హిందూపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు హమాన్ ఉల్లాకు నజీర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు పార్టీ అభివృద్ధి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విరివిగా రుణాలు అందించండి

హిందూపురం : సహకార బ్యాంకు ద్వారా బంగారంపై రుణాలు, జెఎల్‌జి, మహిళా సంఘాల గ్రూపులకు విరివిగా రుణాలను ఇవ్వాలని అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక బ్రాంచ్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. బ్యాంకు డిపాజిట్లు, రుణాల గురించి ఆరా తీశారు. ఖాతాదారులకే బ్యాంకు బలమని, మరిన్ని సేవలు, డిపాజిట్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధర్మవరంలో టిడిపికి పూర్వ వైభవం : పరిటాల

పార్టీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తెస్తామని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో కీలకంగా ఉన్న మాజీ ఎంపీపీ, వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ సాకే మద్దిలేటితోపాటు పలువురు సొంతగూడు అయి టిడిపిలో చేరారు. ఓబుళనాయనిపల్లి మాజీ సర్పంచి నరసింహులు, గంటాపురం మాజీ సర్పంచి అప్పస్వామి, శ్రీనివాసులతోపాటు మొత్తం 175 కుటుంబాలు గురువారం పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికి పరిటాలశ్రీరామ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన మాజీ ఎంపీపీ మద్దిలేటి మాట్లాడుతూ టీడీపీలో తాము ఎప్పుడో చేరాల్సి ఉందని, కానీ కొందరు నేతల దుష్ప్రచారం వల్ల ఇన్ని రోజుల సమయం పట్టిందని అన్నారు. వైసీపీని ఎదుర్కొని నిలబడే శక్తి శ్రీరామ్ కు మాత్రమే ఉందని నమ్మి పార్టీలోకి వచ్చామన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వైసీపీ నాయకులతోపాటు.. పార్టీలో ఉంటూ ద్రోహం చేస్తున్న నాయకుల పేర్లను కూడా రాసుకుంటున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీలోకి రావాలని నియోజకవర్గ వ్యాప్తంగా చాలా మంది అనుకుంటున్నారని కానీ కొందరు నాయకులు దుష్ప్రచారంతో పాటు పక్కదారి పట్టించే మాటల వల్ల ఆలస్యం అవుతోందని అన్నారు. వాస్తవంగా టీడీపీలోకి వస్తే వైసీపీ నేతలు అడ్డుకోవాలే కానీ ఇక్కడ బీజేపీ నాయకులు కూడా అడ్డుపడుతున్నారని విమర్శించారు. వారి వల్ల పార్టీకి నష్టం జరుగుతోందన్నారు. ఒక నేత పార్టీలోకి 'రేపోస్తా,, మర్నాడు వస్తా' అంటూ కార్యకర్తలను పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో కొందరు నేతలు పార్టీలోకి వచ్చే వారిని రానివ్వకుండా చేస్తున్నారని విమర్శించారు. ధర్మవరంలో టీడీపీనాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీ నాయకులను ఏవిధంగా చూస్తున్నామో పార్టీలో ఉంటూ ద్రోహం చేస్తున్న వారిని కూడా అదేవిధంగా చూడాల్సివస్తుందని అన్నారు. ఎమ్మెల్యేగా కేతిరెడ్డి గెలిచాక ఇక్కడి ప్రజలకు స్వాతంత్ర్యం పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక దందాలు, భూ కబ్జాలు, సెటిల్ మెంట్లకు చెక్ పెడతామన్నారు. ప్రపంచంలోనే ఎంతో పేరు ఉన్న సిల్క్ సిటీకి వీరు తెచ్చిన చెడ్డపేరును తొలగిస్తానన్నారు. ప్రతికార్యకర్త కనీసం రోజుకు గంట పనిచేస్తే తిరుగులేని మెజారిటీ తీసుకురావచ్చున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీరాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయ్ కుమార్, కమతంకాటమయ్య, నాయకులు ఫణికుమార్, చింతలపల్లి మహేష్‌చౌదరి, కుంటిమద్దిరంగయ్య, గొట్లూరు శ్రీనివాసులు, బోయరవిచంద్ర, కాచర్ల కంచన్న, ముత్యాలప్పనాయుడు, పోతుకుంట లక్ష్మన్న, మేకలరామాంజినేయులు, పురుషోత్తంగౌడ్, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, రఫూఫ్, కొత్తపేట ఆది, చట్టా లక్ష్మీనారాయణ, రమేష్‌బాబు, గుత్తాసూరి, బొట్టుకిష్ట, భీమనేని ప్రసాద్‌నాయుడు, చిగిచెర్ల రాఘవరెడ్డి, బీబీ, స్వర్ణకుమారి, బాను, చీమల రామాంజి, చీమలసూరి, తలారిచంద్రమోహన్ బాబు, మాధవరెడ్డి, కేశగాళ్లశీన, మహేశ్ పాల్గొన్నారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

ముదిగుబ్బ : వైసిపి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైసిపి నాయకులు అన్నారు. మండలంలోని మల్లేపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమల సేవ్ నాయక్, సచివాలయ కన్వీనర్ భాస్కర్, వెంకటేశ్వర రెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : సంక్షేమ రాజ్యం జగనన్నకే సాధ్యం అని రాష్ట్ర సీఈసీ సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని వెంగలమ్మ చెరువు, చెర్లోపల్లి, కంబాలపర్తి, పైపల్లి, వెంకటగారిపల్లి పంచాయతీల్లో నిర్వహిచిన వైఏపీనీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

హిందూపురం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధినిచూసి మరో జగనన్నను అశీర్వదించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని35వ వార్డులో వార్డు కౌన్సిలర్ జయప్ప ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో వైసిపి జెండాను ఎగురవేసి, వార్డులో అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు అందించిన నిధుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఏ బ్లాక్ అధ్యక్షులు సాదిక్, జెసిఎస్ కన్వీనర్ శివశంకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫరూఖ్, కౌన్సిలర్లు షాజియా, మణి, గిరి, రోషన్ ఆలి, కిరోసిన్ బాబు, వార్డు ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కుచట్టాన్ని రద్దుచేయాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

భూ యాజమాన్య హక్కుచట్టాన్ని వెంటనే రద్దుచేయాలంటూ ధర్మవరం బార్ అసోషియేషన్ ప్రధానకార్యదర్శి రాఘవేంద్ర ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం ధర్మవరం కోర్టు ఎదురుగా కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజావ్యతిరేకమైన ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. దీని ప్రకారం స్థిరాసివిషయంలోతగాదాలు ఏర్పడితే పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధిలో నుంచి తప్పించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లా స్థాయి ట్రిబ్యునల్‌కు వెళుతుందన్నారు.

త్రిసాయుధ దళాల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

దేశ రక్షణలో త్రి సాయుధ దళాలు అందిస్తున్న సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. గురువారం ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన త్రిసాయుధ దళాల పతాక దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాయుధ దళాల సేవలు వారి త్యాగాలను మరువలేనివని, వెలకట్టలేనివని ప్రశంసించారు. అనంతరం సైనిక సంక్షేమానికి తనవంతుగా కలెక్టర్ హుండీలో విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు, ఉద్యోగులు గిరీష్, బాబు, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విధులను నిర్వర్తించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు సెక్టార్ ఆఫీసర్లు సమన్వయంతో భారత ఎన్నికల కమిషన్ నియమ నిబంధన మేరకు తమ తమ విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సెక్టర్ ఆఫీసర్లు ,పోలీసు సెక్టర్ ఆఫీసర్లకు శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎఎస్‌పి విష్ణు, డిఆర్ఒ కొండయ్య, డీఎస్పీలు, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ ఇతర ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, సిఐలు ఇతర పోలీస్ అధికారులు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024న జరిగే నేపథ్యంలో ముందస్తుగా సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్ల కు ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కేవలం పోలీసు యంత్రాంగం తోనే ఎన్నికల నిర్వహణ పూర్తి కాదని, ముఖ్యంగా ఎన్నికల కమిషన్ ద్వారా నోటిఫికేషన్ జారీ అయినప్పటినుండి ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసే వరకు సెక్టర్ ఆఫీసర్ల పాత్ర ఎంతో ముఖ్యమైనదని గుర్తుంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 6 నియోజకవర్గాల పరిధిలోని 32 మండలాల్లో 1516 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా పోలింగ్ కేంద్రాలపై గట్టి నిఘా ఉంచాలని కోరారు. ఎస్పీ విష్ణు మాట్లాడుతూ సెక్టర్ ఆఫీసర్లు పోలీసు సెక్టార్ ఆఫీసర్లు తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. డిఆర్ఒ కొండయ్య మాట్లాడుతూ సెక్టర్ ఆఫీసర్లు, పోలీసు సెక్టార్ ఆఫీసర్లు కలిసి ఎన్నికల నిర్వహణ పనులను చేపట్టాలన్నారు. అనంతరం సెక్టార్ ఆఫీసర్లు పోలీసు సెక్టర్ ఆఫీసర్ల విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం తహశీల్దార్ మైనుద్దీన్, నరసింహులు, ఎంఇఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేగేటు ఫ్లైఓవర్ బాధితకుటుంబాలకు అండగా ఉంటాం

బాధితులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలో కదిరి రైల్వేగేటు ఫ్లైఓవర్ బ్రిడ్జి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణం లోని కదిరి రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిర్వాసిత కుటుంబాలకు చాలీచాలని నష్టపరిహారం చెల్లించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో హైకోర్టులో స్టే ఉన్న వారి ఇళ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. బాదిత కుటుంబాలకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా వారి ఇళ్లను కూల్చడానికి ఆర్అండ్‌బి అధికారులు గురువారం అక్కడికి వెళ్లగా విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ అక్కడికివెళ్లి ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడారు. కోర్టు స్టే ఉన్నా కూడా కూల్చడం సరైన పద్ధతి కాదని, అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం మంచిదికాదని అన్నారు. ఈసందర్భంగా పరిటాల శ్రీరామ్ ఆర్అండ్‌బి ఈఈతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఇళ్లను కూల్చడం నిలిపివేసి అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే ఇళ్లను కూల్చడం, చెట్లను నరకడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయని ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. వెంటనే ఈ పద్ధతులు ప్రతి ఒక్కరు మార్చుకోవాలని సూచించారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అధికారులు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. బాధిత కుటుంబాలకు తగిన రీతిలో నష్టపరిహారం చెల్లించేంతవరకు వారి ఇళ్లను తొలగించాడాన్ని తాము వ్యతిరేకిస్తామని అన్నారు. బాధితులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతంకాటమయ్య, ఫణికుమార్, పరిసే సుధాకర్, అంబటిసనత్ తదితరులు పాల్గొన్నారు.